
# ధైర్యే...సాహసే ...లాసే

ఇమంది రామారావు



సికింద్రాబాద్ రైల్వేస్టేషను ప్లాట్‌ఫామ్ మీద జనం కిటకిటలాడిపోతున్నారు.

ట్రైను గోదావరి ఎక్స్‌ప్రెస్... కదలడానికింకా అయిదునిముషాలే టైమ్ఉంది. ఎనౌన్స్‌మెంట్ తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో పని చేసీ చేయని స్పీకరు సెట్ల ద్వారా ఊదరగొడుతున్నారు.

టైటు పాంటూ నల్లకోటుతో టికెటుకలెక్టరు... కలెక్టరు లెవెల్లో వస్తున్నాడు. అతని వెంట బారులు తీరి తరలి వస్తున్న జనం. వారికి టికెట్ కలెక్టరు మీద ఎక్కడలేని ప్రేమ ఆప్తమిత్రుల్లా, ఆత్మబంధువుల్లా అనుసరిస్తున్నారు. సదరు టికెట్‌కలెక్టరు గారు వారిని కసిగా దోమల్ని తరిమినట్లు తరిమేస్తున్నాడు. అయినా జనాలు పట్టువదలని చికెన్ గున్యా దోమల్లా వెంటపడుతున్నారు.

టీసీ విసుక్కుంటూ ''బోగీలన్నీ నిండిపోయాయండీ...నన్నేంచేయమంటారు?'' ఓ బోగీ దగ్గర ఆగి సీరియస్‌గా ముఖం చిట్లించి మరీ అడిగాడు పాసింజర్లని అందులో ఒక పాసింజరు మరీ ప్రాధేయపడుతున్నాడు.

''అయ్యా టీసీగారూ! ఏదో ఒకటి చెయ్యాలి మీరే!'' టీసీ చేతులు పట్టుకొని దాదాపు కాళ్ళు పట్టుకున్నంత దీనంగా అడిగాడు పాసింజరు.

టీసీ బిగుసుకుపోతూ ''బెర్తులు ఖాళీ లేవండీ..లేనివి ఎక్కడ్నించి తేనూ?''

''నా కళ్ళముందే రెండు బెర్తులిచ్చారు కదండీ!''

''అదీ...అదీ.. ఆర్యేసీ బై!''

''మీరు తలచుకుంటే ఎలాగైనా ఇవ్వగలరు!'' టికెటు కింద వందరూపాయిల నోటు కనీకనిపించకుండా పెట్టి ఇచ్చాడు పాసింజరు.

''వందా! నా బొందలా వుంది! మీరు రిజర్వేషను చేసుకుంటే బెర్తుకే వందరూపాయిలవుతాయి కదండీ. అయినా బెర్తులు ఖాళీలేవండీ బాబూ'' కళ్ళద్దాలు పగిలిపోయేటంత తీక్షణంగా చూశాడు టీసీ.

''బాబ్బాబూ! మరో వందుంచండి!''

''ఇదేవన్నా చేపల మార్కెటనుకుంటున్నారా బేరమాడ్డానికి! వెళ్ళండి!...నన్ను చార్టు చెక్ చేసుకోనీండి!'' ముఖం కందగడ్డలా పెట్టుకొంటూ అన్నాడు టీసీ.

''అలా చీదరించుకుంటే ఎలాగండీ... ప్రయాణీకులకు సేవ చెయ్యడానికేగా మీరున్నారు. యూ ఆరె పబ్లిక్ సర్వెంట్!'' లాజిక్‌లాగాడు పాసింజరు పెద్దమనిషి.

''అయ్యా! పాసింజరు మహానుభావా! మీకే సేవలు చెయ్యాలో చెప్పండి. మీ కాళ్లు పట్టుకోమంటారా? లేకపోతే మీకాళ్లు కడిగి నానెత్తిమీద చల్లుకోమంటారా?'' కళ్ళద్దాలు తీసి ముఖానికి పట్టిన చెమట మూడుసార్లు తుడుచుకుంటూ అడిగాడు టీసీ.

''మీరంత పని చెయ్యఖ్ఖర్లేదు. మూడు బెర్త

లిప్పించండి చాలు!'' ఆ పాసింజరు పెద్దమనిషి మరోవంద చేర్చాడు.

టీసీ ఆ పాసింజరు కేసి గుర్రుగా చూశాడు. ఇంతలో.

''సారూ! మీ గొడవ తర్వాత మాకో రెండు బెర్త్ లిప్పించండి!'' టికెట్టూ అయిదువందల రూపాయిల నోటూ తెలివిగా టీసీ చేతిలో ఎట్టాడు.

టీసి చటుక్కున నోటు జేబులో కుక్కుకొని... ''మీరు ఎస్త్రీ ఫిఫ్టీఫోర్ ఫిఫ్టీ ఫైవ్‌లో కూర్చోండి!'' సాధ్యమైనంత నెమ్మదిగా అన్నాడు.

''అలాగే నాకూ కనీసం రెండు బెర్త్‌నెంబర్లు చెప్పండి!'' మొదటి ఆసామి మళ్ళీ మొదటికొచ్చాడు. టీసీ వినీ విననట్టు వూరుకున్నాడు.

ఈలోగా నలభయ్యేళ్ళ వయసు బడ్డ ఆమె ఇంత మొహం చేసుకొని

''ఎక్స్‌క్యూజ్ మీ!'' అంది.

కళ్ళు చెదరగొట్టే అందం ఆమెను కూశాక అంత టెన్షన్లోనూ టీసీ కర్చీపుతో ముఖం ముప్పై మూడుసార్లు రుద్దుకున్నాడు. ఆమె అందంగా నవ్వింది. ఆ నవ్వుకి టీసీ జావగారి పోయాడు.

''నువ్వెళ్ళి నా సీట్లో కూర్చోమ్మా! చూసి చెప్తాను!'' అంటూ ఆర్డరు జారీ చేయడంతో ఆమె ఒంపు సొంపులు ప్రదర్శిస్తూ చకచకా ట్రైనెక్కేసింది. టీసీ సీట్లో కూర్చుంది.

''అసలేందయ్యా నీ భాగోతం...నా కంటే వెనకొచ్చిన వారికి బెర్త్ లిచ్చి పంపిస్తావా? నేను మూడొందలిస్తున్నా మూతి ముడుచుక్కూర్చుంటావా? ఆయ్!'' గయ్‌మన్నాడు పాసింజరు.

టీసీ అతగాడ్ని పట్టించుకోలేదు. మరికొంత మంది జనం రావడం బేరాలు కుదిరిన వాళ్ళని లోపలికి పంపించడం బేరం కుదరని వాళ్ళని తరిమి పంపించడం జరగిపోయింది. ఫైనల్ ఎనౌన్స్‌మెంట్ ఇచ్చేశారు. గార్డు పచ్చజెండా వూపేశాడు. ట్రైను కదిలింది.

***

టీసీ బోగీల్లో వీరవిహారం చేస్తున్నాడు. అష్టవంకరలు తిరిగిపోతూ రిజర్వేషను లేకుండా కూర్చున్నవాళ్ళని. తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీషు భాషల్లో తిడుతూ ఆయాసపడిపోతున్నాడు. తన అదృష్టవశాత్తు భోగీలు ఖాళీగా వుండటం వలన గిరాకీ బాగా పెరిగింది. కోటు జేబులూ, ఫేంటుజేబులూ నిండిపోయాయి. మిగతా బోగీల్లోనూ చెకింగ్‌పూర్తయింది. ఇదంతా తన సీట్లో కూర్చున్నామె గమనిస్తోంది. టీసీనే రెప్పార్పకుండా చూస్తోంది. మధ్యమధ్యలో పెదవుల మీద నవ్వులారబోసుకుంటోంది. టీసీ టాయ్‌లెట్ వెళ్ళి ఫ్రెషప్పయి...ముఖానికి ఫెయిర్ అండ్ లవ్లీ దట్టంగా పట్టించి నెత్తిమీద చెల్లాచెదురైన నాలుగువెంట్రుకల్ని దువ్వుకుంటూ తన సీట్లో కొచ్చి కూర్చున్నాడు సైడ్‌బెర్త్ కాబట్టి ప్రైవసీగా వుంది. ఇద్దరూ ఎదురుబొదురుగా కూర్చోడానికి అనుకూలంగా వుంది.

''మీ పేరు సుందరం కదూ?'' ఆమె కల్పించుకొని అడిగింది.

''అరె నా పేరు మీకెలా తెలుసు?'' టీసీ విస్తుపోయాడు.

''మీ నేమ్ ప్లేట్‌మీదుందిగా!'' కిసుక్కున నవ్వింది.

''వాటె బ్రిల్లియంట్ మరి మీ పేరు చెప్పలేదు!'' కులుకుతూ అడిగాడు.

''సుబ్బలక్ష్మి'' చనువున్న వాళ్ళంతా లక్ష్మీ అని పిలుస్తారు!''

''నేను 'లక్ష్మీ' అనే పిలుస్తాను''

''మీ ఇష్టం!''

''ఏదైనా నా ఇష్టమేనా?''

''మీరు చాలా తమాషాగా మాట్లాడతారు!''

''మాటలేకాదు...చేతలు కూడా తమాషాగానే వుంటాయి!''

''చూస్తున్నానుగా!'' సమ్మోహనంగా చూసింది సుబ్బలక్ష్మి.

''మీరు చూసింది చాలా తక్కువ. అసలు నా విశ్వరూపం చూళ్ళేదు. నేను మంచివాళ్ళకి మంచివాణ్ణి. చెడ్డవాళ్ళకి చండశాసనుడ్ని! దేవుడే దిగొచ్చినా లెఖ్ఖ చేయను. మా డిపార్టుమెంటులో డేరింగ్ అండ్ డాషింగెండ్ డైనమిక్ యంగ్ మేన్ అనే పేరుంది!'' సాధ్యమైనంత అందంగా కనిపించడానికి అసోపాలు పడుతూ చెప్పేడు.

సుబ్బలక్ష్మి తన్మయత్వంతో అతగాడి గొప్పతనాన్ని వింది.

టీసీ మురిసిపోయాడు.

కాస్సేపు ఊహాలోకాల్లో తేలిపోయాడు.

''ఏవిటాలోచిస్తున్నారు?'' ఇంకాస్త దగ్గరకు జరిగింది. టీసీలో చలనం బయలుదేరింది. వేడిరాజుకుంది. బోగీల్లో లైట్లార్పి నిద్రకుపక్రమిస్తున్నారు. సుబ్బలక్ష్మి జడలో తురుముకున్న మల్లెలు గుభాళిస్తున్నాయి. గమ్మత్తుగా మత్తెక్కెస్తున్నాయి. ఇద్దరిమధ్యా తీయని మౌనం.

''ఏమన్నా కబుర్లు చెప్పండి!'' తనే కల్పించుకుంటూ అడిగింది.

''నిన్ను చూస్తుంటే మాటలు రావడం లేదు!''

''నా పరిస్థితీ అదే!''

''ఏవన్నా తిన్నారా?'' టాపిక్ మారుస్తూ అంది.

''ఏం పెడతారూ?''

''నా క్కావల్సింది ఇస్తావా?''

''ఇవ్వకపోతే...''

''నేనొదల్ను అసలే చండశాసనముండావాడ్ని''


''అలాగైతే తప్పదుగా!'' మురిపెంగా అంది.

''ఏదీ ప్రామిస్ చెయ్యి!'' టీసీ చెయ్యి చాపేడు.

''ప్రామిస్!'' చేతిలో చెయ్యేసి గిల్లింది. టీసీ గిలగిల్లాడి పోయాడు. అయితే వారిని ఎవరూ గమనించలేదు. ఎవరి మానాన వారు నిద్రపోతున్నారు, పైగా సుబ్బలక్ష్మి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. టీసీ ధైర్యంచేసి

''అయ్ వాంట్‌యూ!'' అన్నాడు ఇంగ్లీషులో స్టయిల్‌గా

''వాట్‌డుయూ మీన్!'' అంది తృళ్ళిపడినట్లు నటించి చిరుకోపంతో




## బి.ఎన్.రెడ్డిని ఆకట్టుకున్న సినిమా

పూనా ఫిలిం ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు *1968-69* సంవత్సరాల్లో కొన్ని చిత్రాలు నిర్మించారు. *1970* ఫిబ్రవరి నెలలో వాటిని మద్రాసులోని సినీ ప్రముఖులకు ప్రదర్శించారు. అందులో చాలామందిని ఆకట్టుకున్న సినిమా పియా కా ఘర్. వసంత్ కౌల్ అనే మరాఠీ రచయిత రాసిన కథ ఈ సినిమాకు ఆధారం. బొంబాయిలో ఒకే ఒక్క గదిలో వుండే ఉమ్మడి కుటుంబంలోకి వచ్చిన కొత్త కోడలు చాటులేక పడే బాధను చాలా సంస్కారవంతంగా చూపించారీ చిత్రంలో. పియాకా ఘర్ చిత్రం రచనా, దర్శకత్వం ఐదుగురు విద్యార్థులు చేశారు. ఛాయాగ్రహణం, శబ్దగ్రహణం పదేసిమంది చొప్పున నిర్వహించారు. ఎడిటింగ్ పని పదకొండు మంది పంచుకున్నారు. ఇంతమంది కలిసి తీసినా సినిమా ఎక్కడా అతుకుల బొంతలాగా కనిపించదు. ఇన్‌స్టిట్యూట్‌కి అతిథిగా వెళ్ళి ఈ సినిమా చూసిన బి.ఎన్. రెడ్డి విద్యార్థుల ప్రతిభా పాటవాలకు విస్తుపోయారు. వారిని మనసారా అభినందించారు. తరువాత ఇదే చిత్రాన్ని బాసు ఛటర్జీ దర్శకత్వంలో రాజశ్రీ సంస్థ ఇదే పేరుతో అనిల్ ధావన్, జయబాధురి జంటగా తీసింది. దానికి దర్శకుడు బాసు ఛటర్జీ. ఆ సినిమా కూడా అఖండ విజయం సాధించింది.

''అయ్‌మీన్ యూనో నీకు తెలిసీ నాతో చెప్పించాలనా? అమ్మదొంగా!'' చనువు తీసుకొని ఇంకాస్త దగ్గరకు జరిగేడు.

రైలు వేగం పెరిగింది. అంతకంటె వేగం టీసీలో పెరిగింది. ఈ రోజు నక్కనితొక్కొచ్చాను. లోలోపలే సంబరపడిపోయాడు. నాలుగుజే బులూ నిండిపోయాయి. ఒక అందమైన తన దృష్టిలో అప్సరస లాంటి అమ్మాయితో తన పంట పండిపోయింది. ఇక ధైర్యం చెయ్యడమొకటే తరువాయి.

''ధైర్యేసాహసే...లక్ష్మీ'' అనుకున్నాడు.

''చీకట్లో ఆ చందమామ వెలుతురు నీ మీద పడి ఎంతందంగా కనిపిస్తున్నావో తెలుసా?'' అన్నాడు సినిమా హీరోలా ధైర్యం చేసి ఆమె భుజం మీద చెయ్యేస్తూ.

''ఎంతందంగా కనిపిస్తున్నానూ?'' రెచ్చగొడుతూ అడిగింది.

''చందమామంత!...మరి...నేనెలా కనిపిస్తున్నానూ? మెలికలు తిరగిపోతూ అడిగాడు.

''చీకట్లో మీ కళ్ళూ పళ్ళూ ఎంతందంగా కనిపిస్తున్నాయో!'' అంది హస్కీగా. అది పొగడ్తో, తెగడ్తో తెలియని అయోమయస్థితిలో పడిపోయాడు టీసీ. ఆమెను చూస్తోంటే కూనిరాగం తీయాలనిపించింది. గొంతు సవరించుకొని.

''ఒక కొంటెపిల్లనే చూశా..అరనవ్వు నవ్వమని అడిగా

ఆమె నవ్వే నవ్వితే... వందమంది చచ్చిపోయారే! అయిరే...అయిరే!'' ఆయాసపడిపోతూ ఆగిపోయాడు. సుబ్బలక్ష్మి పగలబడి నవ్వింది.

టీసీకి పిచ్చెక్కెనంత పనయింది.

ఒక్కసారి తనివితీరా సుబ్బలక్ష్మిని కావలించుకోవాలనుకున్నాడు.

ధైర్యే..సాహసే లక్ష్మీ అని మనసులో అనుకొని ఆమెను వాటేసుకున్నాడు...అంతే!

''మిస్టర్ సుందరం వాటీజ్ దిస్?'' సూట్‌వాలా గొంతు ఖంగుమంది.

''అసలెవరండీ మీరూ?'' ఛీఛీ అవతలికి ఫో అన్ని లెవెల్లో అడిగాడు.

''ఐ యామ్ ఫ్రం స్పెషల్ స్క్వాడ్ నువ్వు చేస్తున్న పనేంటి?'' ఐ.డి. కార్డు చేత్తో చూపిస్తూ అడిగాడు. సుందరానికి గొంతు పెకల్లేదు. ముచ్చెమటలు పట్టాయి.

''సార్! ఈవిడ మా మేనకోడలు . పేషెంట్. విశాఖపట్నం కేజీహెచ్‌లో చూపించడం కోసం తీసుకెళ్తున్నా!'' గోడకట్టినట్టు అబద్ధం చెప్పేననుకొని సంబరపడిపోయాడు.

''ఆమెకు రిజర్వేషనుందా?''

''ఆమె మా మేనకోడలని చెప్పేనుకదా సారూ!''

''మిమ్మల్ని సస్పెండ్ చెయ్యాల్సి వుంటుంది!''

''అంత తప్పు నేనేం చేశానూ?'' అమాయకంగా ప్రశ్నించాడు టీసి.

''రిజర్వేషను లేని ప్రయాణీకురాల్ని సమర్థించడం తప్పుకాదా? పైగా ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడం తప్పుకాదా? పైగా ఆమె నీ మేనకోడలా? మీ నాన్నగారి పేరేవిటో చెప్పమను చూద్దాం!'' సీరియస్‌గా అడిగాడు సూటువాలా.

టీసీ, సుబ్బలక్ష్మి ఇద్దరూ బిక్కచచ్చిపోయారు.

''ఏవమ్మా! ఈయన గారి మేనకోడలివైతే.. వాళ్ళ నాన్నగారి పేరు చెప్పడానికి ఇంత సేపు తటపటాయిస్తావే?'' సూటిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

''సారీ నాకేం తెలీదు. నాకు రిజర్వేషను లేదని ముందే చెప్పేను. తన సీట్లో కూర్చోమన్నాడు. కూర్చున్నాను. ఏవేవో పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతున్నాడు. పిచ్చిపిచ్చి చేష్టలు చేస్తున్నాడు. నాకు భలే ఏడుపొచ్చింది. ఇంతలో మీరొచ్చారు దేవుడిలా'' అంది పైటచెంగుతో కళ్లు తుడుచుకుంటూ.

''అమ్మనీ... ఎంతటి గ్రంధసాంగురాలివే!'' టీసి కళ్ళురుముతూ పళ్ళునూరాడు.

''చూడు మిస్టర్ సుందరం! ఇప్పుడేమంటావ్?'' కళ్ళల్లోకి సూటిగా చూశాడు సూటువాలా సుందరానికి తలకాయ తీసేసి నట్లునిపించింది. కాళ్ల బేరానికొచ్చాడు.

''గురూగారూ! ఓ సారిలా రండి!... ఏదో కక్కుర్తి పడ్డాను.. జన్మానికో శివరాత్రిలా ఆశపడ్డాను...మనం మనం డిపార్టుమెంటు వాళ్ళం. ఈ తప్పు క్షమించండి. ఇదిగో! వైజాగ్‌లో షాపింగ్ చేదామని మూడువేలు తెచ్చుకున్నాను. స్వీకరించండి. ఈ దాసుడ్ని కనికరించండి'' సుందరం భాషా మార్చేసాడు, యాసామార్చేశాడు. స్పెషలాఫీసరు కాళ్ళమీద పడిపోయాడు.



''ఒ.కె.. ఒ.కె...కాళ్లమీద పడ్డావు కాబట్టి కనికరించి వదిలేస్తున్నాను. ఇంకెప్పుడూ ఇలాంటిపనులు చేయకు!'' సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చాడు.

''ఇంకానా! ఈ జన్మకు చెయ్యను'' లెంపలేసుకున్నాడు టీసీ.

ఆ సుందరాంగిని అక్కడ్నించి తరిమికొట్టినంత పంపేశాడు.

****

ఎంత ప్రయత్నించినా సుందరానికి నిద్రపట్టలేదు.

మూడువేలూ ముద్దుగుమ్మా నష్టం కష్టం రెండూ ఒకేసారి కలిగాయి. ఇంతలో పెద్దగా నవ్వులు వినిపించాయి. అది సుబ్బలక్ష్మి నవ్వే. గుండాగినంత పనైంది. దగ్గరికెళ్లి వారిమాటల్ని చెవులు రిక్కించి మరీ విన్నాడు. అవి సుబ్బలక్ష్మి మాటలే.

''అవునూ.. నాకంటే డ్రామాల్లో నటించే అనుభవముంది. వాడ్ని పడకొట్టాను. నువ్వేలా నటించగలిగేవ్?'' సూట్‌కేసూ బ్యాగూ బైటికి లాగి ట్రైను దిగడానికి సిద్ధమౌతూ అడిగింది. దానికా స్పెషలాఫీసరు వేషధారి పగలబడి నవ్వుతూ

''వాడి బొంద! వాడి పిచ్చిగంతులు చూశాక.. వాడ్ని ఈజీగా పడగొట్టొచ్చనిపించింది. పైగా నీ మైకంలో వున్నాడు. నేను స్పెషల్‌స్క్వాడ్ అనగానే వాడి బుర్ర పంచెయ్యడం మానేసింది. లేకపోతే ఎంతబ్రతిమాలినా రిజర్వేషనివ్వడా? డబ్బులు చేతిలో ఎట్టినా 'ఛీ' కొట్టాడు! పైగా వీడొక డేరింగెండ్ డాషింగెండ్ డైనమిక్ యంగ్ మేనంట అదిగో అనకాపల్లి స్టేషనొచ్చేసింది దిగు'' అంటూ బ్యాగు తగిలించుకొని వడివడిగా కిందకి దిగాడు. అతడ్ననుసరించింది సుబ్బలక్ష్మి.

సుందరానికి బీపి పెరిగిపోయింది.

హనుమంతుడులా లంఘించి ఇద్దర్నీ కొట్టి కొట్టి పడెయ్యాలనిపించింది.

తన కోసం ట్రైనాగదుగా ట్రైను కదిలింది, స్పీడందుకుంది.

తన జీవితంలో ఏం చేసినా ధైర్యంగానే చేశాడు. లంచం తీసుకున్నా పాసింజర్లతో పేచీ పెట్టుకున్నా ఎప్పుడూ తన పంతమే నెగ్గించుకొనేవాడు. జీవితంలో మొట్టమొదటిసారిగా స్త్రీ వ్యామోహం బలహీనతకి లొంగిపోయాడు కాబట్టి తగిన ఫలం అనుభవించాడు.

ఇక ముందు స్త్రీలకి దూరంగా వుండాలనుకున్నాడు. టన్నులకొద్దీ ధైర్యం తనలో వుందనుకున్న సుందరానికి మంచి పనులకి తప్ప ఇటువంటి దుర్వ్యసనాలకి ''ధైర్యేసాహసే లాసే!'' అనిపించింది.

★